ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 9 ఏప్రిల్ 2025



'చిన్న కాళేశ్వరం' సర్వే అడ్డగింత

కాటారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాదరావుపేట రెవెన్యూ పరిధిలో చిన్న కాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీల భూసేకరణ కోసం చేపట్టిన సర్వేను మంగళవారం పలువురు రైతులు అడ్డగించారు. మెయిన్ కెనాల్ నుంచి వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కోసం డీఐవోఎస్ రాము ఆధ్వర్యంలో చేపడుతున్న సర్వేను రైతులు నిలిపేశారు. కెనాల్ కాకుండా పైప్‌లైన్ వేయాలని లేదా అలైన్‌మెంట్ మార్చాలని అధికారులకు తెలిపారు. అన్ని రకాలుగా ఆలోచించే సర్వే చేపట్టారని, అభ్యంతరం తెలిపితే సర్వేను నిలిపేస్తామని ఇరిగేషన్ డీఈఈ ఉపేందర్, ఏఈ వెంకన్న రైతులతో అన్నారు. దీనిపై తర్వాత చర్చిద్దామని రైతులు చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.



పేద కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ

గరీబోళ్లకు అండగా కాంగ్రెస్ సర్కార్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- గిరిజనుడి ఇంట్లో భోజనం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రభుత్వం అందజేసిన రేషన్ బియ్యంతో వండిన వంటను మంగళవారం భూపాలపల్లి పట్టణ పరిధి కారల్ మార్క్స్‌కాలనీలోని ఓ గిరిజనుడి ఇంట్లో ఎమ్మెల్యే, కలెక్టర్ భుజించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనవంతులు తినే బియ్యాన్నే పేదలూ తినాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేదవారు సన్న బియ్యాన్ని తీసుకుని ఎంతో సంతృప్తిగా తింటుంటే తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నా ‌ు. పేదవారి ఆకలిని తీర్చడమే కాకుండా ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ పథకంలో నిల్వ నీడను ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 58వేల ఉద్యోగాల భర్తీ చేయడమే కాకుండా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాస్ పథకం కింద రుణాలు అందిస్తున్నామన్నారు. పేదలైన రావు మౌనిక, కిషన్ దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. వారి యోగా క్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, కొంరయ్య, దాట్ల శ్రీనివాస్, దేవన్, శిరుప అనిల్, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం

రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్, కారల్‌మార్క్స్‌కాలనీలో జైభీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మనదేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిందన్నారు. సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుచిత నిర్ణయాల వల్ల ఎద, బడుగు, బలహీన వర్గాల ఆకాంక్షలు నెరవేరడం లేదని విమర్శించారు.



పట్టించుకొనే వారు పట్టుకునే వారు లేక

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుట్కా, పాన్‌మసాలా, తంబాకు ప్యాకెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయితో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించినా వీటి అమ్మకాలు విచ్చల విడిగా జరుగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారుల ఉదాసీనత వైఖరి వల్ల ఈ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. గుట్కా, పాన్‌మాసాలా, తంబాకు (అంబర్) ప్యాకెట్లు మార్కెట్‌లో బహిరంగంగానే దొరుకుతున్నాయి. అయినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు.

యథేచ్ఛగా గుట్కా, పాన్ మసాలా విక్రయాలు


- జిల్లాలో జోరుగా అక్రమ వ్యాపారం
- నిషేధం ఉన్నా కొనసాగుతున్న దందా
- అధిక రేట్లకు అమ్మకాలు జరుగుతున్నా చర్యలు శూన్యం

ఇతర రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతి

గుట్కా, పాన్‌మాసాలా, తంబాకు ఉత్పత్తుల రవాణా మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటకలోని బీదర్ నుంచి జోరుగా సాగుతోంది. ఇక్కడి బడా వ్యాపారులు పెద్ద ఎత్తున వాటినే దిగుమతులు చేసుకుంటున్నారు. అక్కడి నుంచి పాన్‌షాపులు, కిరాణా షాపులు, చిన్న చిన్న బడ్డీ కొట్లలో చిరు వ్యాపారరులు వాటిని అమ్ముతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్దపల్లి జిల్లా మంథనికి, అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లాకు గుట్కాలు, తంబాకు ప్యాకెట్ల రవాణా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్, మంజూర్‌నగర్, కాశీంపల్లి, జంగేడు కేంద్రంగా ఈ దందా యాథేచ్ఛగా సాగుతోంది. అనంతరం ఇక్కడి నుంచి వివిధ గ్రామాలు, మండలాలకు తరలివెళ్తాయి. వీటిని 25కేజీల రైస్‌బ్యాగ్‌లలో వేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు జరుపుతున్నారని తెలుస్తోంది. అయినా పట్టించుకొనే వారు లేరు.. పట్టుకొనే వారూ కరువయ్యారు.

చితికిపోతున్న బతుకులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మారుమూల అటవి ప్రాంతం. పైగా ఇక్కడ కూలీల సంఖ్య ఎక్కువే. సింగరేణి, జెన్‌కో విద్యుత్ కేంద్రంలో పనిచేసే కార్మికులతోపాటు వాటిపై పరోక్షంగా ఆధారపడి బతికే కూలీలు, చిరు వ్యాపారుల సంఖ్య వేలల్లో ఉంటుంది. వీరిలో దాదాపు 70శాతం గుట్కా, అంబర్‌కు అలవాటుపడిన వారే ఉన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇతరత్రా రంగాల్లో పనిచేసే వారు వీటికి అలవాటుపడి అనారోగ్య బారిన పడుతున్నారు. మరెందరో క్యాన్సర్‌తో ప్రాణాలు వదులుతున్నారు. ఈ దురలవాటు వల్ల అనేక మంది ఆర్థికంగా చితికిపోతున్నారు.



రకరకాల పేర్లు.. అధిక రేట్లు..

గుట్కాలు, పాన్‌మసాలా, తంబాకు ఉత్పత్తులకు రకరకాల పేర్లు పెట్టి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. నిషేధం ఉండటంతో వీటికి మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది. దీన్ని ఆసరా చేసుకొనే వ్యాపారులు ఎంఆర్‌పీకి కాకుండా అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. వీటిలో విమల్, మాణిక్‌చంద్(ఎంసీ), సీతార్, గోవా, ఎంజీఎం, హాన్స్, చైనీఖైనీ, మీరాజ్, రెబల్, సిమ్లా, పాన్‌బార్, 1000 ఖలేజా, ఆర్‌డీఎం, కే7000, కే9000, 24క్యారెట్ వంటి అనేక పేర్లతో గుట్కాలు, తంబాకు ప్యాకెట్లు లభ్యమవుతున్నాయి.

పట్టించుకోని పోలీసులు!

రాష్ట్ర ప్రభుత్వం ప్రాణాంతక ఉత్పత్తులను పూర్తిగా నిషేధించినప్పటికీ పోలీసులు దృష్టి సారించడం లేదనే వాదనలు ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ ఓపెన్‌గా విక్రయాలు జరగడమే ఇందుకు నిదర్శమని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ ఇంకా ఈ దందా కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఈ ఉత్పత్తులపై ఉక్కుపాదం మోపాలని సామాన్య ప్రజలతోపాటు యువజన సంఘాల నేతలు కోరుతున్నారు.

ప్రకృతి ప్రకోపం

పంటలకు అపార నష్టం

- 9,110 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 8,895 ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన వరి
- ధ్వంసమైన 41 ఇళ్లు



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో వడగండ్ల వానకు రాలిన మామిడి కాయలు



మంగపేట మండలం నర్సింహసాగర్‌లో నేలపాలైన వడ్లు

ములుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాపై ప్రకృతి పగబట్టినట్టుంది. ఈదురుగాలలు, వడగండ్ల వానలతో అన్నదాతలకు తీరని నష్టం కలుగుతోంది. ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు అకాల వర్షాలు కురిశాయి. దీంతో చేతికి వచ్చే దశలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ పరిణామంతో రైతన్నలు గుండెలు బాదుకుంటున్నారు. ఈనెల 3న జిల్లావ్యాప్తంగా వడగండ్ల వాన కురవగా 7వ తేదీ (సోమవారం) సాయంత్రం మరోసారి విరుచుకుపడింది. దీంతో 4,804 మందికి చెందిన 8,895 ఎకరాల్లో వరి పంట తుడిచిపెట్టుకుపోయింది. కోతకు సిద్ధంగా వరి కంకులకున్న గింజలు పూర్తిగా రాలిపోయాయి. వందల ఎకరాల్లో నేలవాలిపోయి కనీసం కోతకు కూడా పనికిరాకుండా పోయింది. పదెకరాల్లో మొక్కజొన్న, 148 ఎకరాల్లో మామిడి, 44 ఎకరాల్లో అరటి, 13 ఎకరాల్లో బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు కచ్చితమైన నివేదికను రూపొందించేందుకు సర్వేను కొనసాగిస్తున్నారు.

గోవిందరావుపేట, మంగపేట, ఏటూరునాగారం, ములుగు, వెంకటాపూర్ మండలాల్లో ఈదురుగాలులు వీయగా రాళ్లవాన తీవ్ర ప్రభావం చూపింది. దీంతో గోవిందరావుపేట మండలంలో 1,582 మంది రైతులకు చెందిన 3,950 ఎకరాల్లో వరి, 93 మంది రైతులకు చెందిన 120 ఎకరాల్లో మామిడి, మంగపేటలో 1,072 మంది రైతులకు చెందిన 3,085 ఎకరాల్లో వరి, ముగ్గురు రైతులకు చెందిన నాలుగెకరాల మొక్కజొన్న, ఏటూరునాగారంలో 2,022 మంది రైతులకు చెందిన 1,860 ఎకరాల్లో వరి, నలుగురు రైతులకు చెందిన పదెకరాల్లో మెక్కజొన్న, ముగ్గురు రైతులకు చెందిన నాలుగెకరాల మామిడి, ములుగు మండలంలో పది మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో వరి, 28 మంది రైతులకు చెందిన 41 ఎకరాల అరటి, ఆరుగురు రైతులకు చెందిన 13 ఎకరాల బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి.

అదేవిధంగా వెంకటాపూర్ మండలంలో ఓ రైతుకు చెందిన మూడెకరాల అరటితోట ధ్వంసమైంది. జిల్లా వ్యాప్తంగా 41 ఇళ్ల పైకప్పులు, గోడలు దెబ్బతిన్నాయి. మిర్చి కోతలు పూర్తికాగా రైతులు కల్లాల్లో ఆరబోసుకున్నారు. అకాల వర్షానికి కాయలు తడుస్తుండగా నాణ్యత తగ్గి ధర కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. మంగపేట మండలంలో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్, ఆర్డీవో, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రపరిశీలన చేసి నష్టాన్ని అంచనా వేశారు. మరో రెండు రోజులు వర్షసూచన ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



భూపాలపల్లి జిల్లా చిట్యాల శివారులో నేలకొరిగిన అరటి తోట

తడిసిన ధాన్యాన్ని కొంటాం : మంత్రి ధనసరి అనసూయ సీతక్క

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన జారీ చేశారు. తడిసిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని భరోసానిచ్చారు. పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

భూపాలపల్లి జిల్లాలో బీభత్సం

భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలుల బీభత్సానికి పలు మండలాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. చిట్యాల మండలంలో 30 ఎకరాల్లో అరటితోట నెలకూలింది. పదెకరాల్లో బొప్పాయి తోటలో కొంత కాయరాలిపోగా, మరికొన్ని చెట్లు నేలకొరిగినట్లు రైతులు తెలిపారు. మరో పదెకరాల్లో మామిడి చెట్లకు విరగకాసిన కాయలు నేలరాలినట్లు తెలిపారు. రేగొండ మండల కేంద్రంలో నాలుగెకరాల మొక్కజొన్న ధ్వంసమైంది. ఆరెకరాల మామిడి తోటలోని కాయలు నేలరాలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి మండలంలోని ఎస్‌ఎం కొత్తపల్లి గ్రామంలోని పోలాటి సరోజన అనే వృద్ధురాలికి చెందిన ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. అక్కడక్కడ పలు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.



బడిబాట ర్యాలీలో డీఈవో, అధికారులు, నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

విద్యా శాఖ జిల్లా అధికారి రాజేందర్

కాటారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాభ్యాసం అందుబాటులో ఉందని విద్యా శాఖ జిల్లా అధికారి (డీఈవో) ముద్దమళ్ల రాజేందర్ అన్నారు. కాటారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ముందస్తు బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల నుంచి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఇందులో టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని ముందస్తుగానే నిర్వహించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి కృషి చేద్దామన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, భోజనం, ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న ఆధునిక సాంకేతికత, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, జిల్లా ప్లానింగ్ అధికారి రాజగోపాల్, ఏఎంవో లక్ష్మణ్, సీఎంవో రమేష్, ఎంఈవో శ్రీదేవి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ మహేశ్వరి, సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది సుదర్శన్, సతీష్, తిరుపతిరెడ్డి, రవిశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గైర్హాజరైన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

చేజేతులా ఉద్యోగం కోల్పోవద్దు

గైర్హాజరైన కార్మికులకు సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి కౌన్సెలింగ్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు చేజేతులా ఉద్యోగం కోల్పోవద్దని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఏరియాలో పని చేస్తూ తరచూ గైర్హాజరవుతున్నా కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులకు స్థానిక రెస్క్యూ స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలో మూడేళ్లుగా వంద మస్టర్లు నిండని 364 మంది కార్మికులు ఉన్నారన్నారు. ఈ ఏడాది కూడా వారి అటెండెన్స్ మెరుగుపడలేదని తెలిపారు. వీరిలో 80 మంది వరకు డిస్మిస్ చేసే కేసులే ఉన్నాయన్నారు. అయినప్పటికీ ఓపికపట్టి ఒక్క చాన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతో మూడు నెలల వ్యవధి ఇచ్చామని, అయినా మార్పు రావడం లేదని మండిపడ్డారు. సింగరేణిలో పని చేసేందుకు చాలా మంది మహిళలు ముందుకొస్తున్నారన్నారు. కేటీకే 5 ఇన్‌క్లైన్‌లో 18 మంది మహిళా ఉద్యోగులు ఉన్నారని, వీరంతా రోజూ అండర్‌గ్రౌండ్‌లో పని చేస్తున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులకే లేని సమస్య పురుషులకేమిటని ప్రశ్నించారు. బొగ్గు ఉత్పత్తిలో భూపాలపల్లి ఏరియా చాలా వెనుకంజలో ఉందన్నారు. కార్మికులు కచ్చితంగా ఎనిమిది గంటలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గైర్హాజరు కాకుండా విధుల్లోకి రావాలని సూచించారు. ప్రస్తుతం గైర్హాజరు లిస్టులో ఉన్న వారికి మరో మూడు నెలలు అవకాశం కల్పిస్తున్నామని, అయినా మార్పు రాకపోతే నష్టపోతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం కవీంద్రతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలపై పెనుభారం మోపడం సరికాదు

- గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి
- సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం పేదలపై పెనుభారం మోపడం దారుణమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం నిరసన ర్యాలీ జరిగింది. కొమురయ్య భవన్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం సరికాదన్నారు. పేదలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక ఇబ్బందులు పడుతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం మరింత భారాన్ని మోపుతోందని మండిపడ్డారు. పంటకు గిట్టుబాటు ధర లేక రోజువారీ కూలి వేతనం పెరగలేక నానా అవస్థలు పడుతుంటే బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ ఇలా ధరలు పెంచుకుంటూపోతే పేదలు ఎలా బతికేదని ప్రశ్నించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేముల శ్రీకాంత్, నేరేళ్ల జోసెఫ్, అస్లాం, మంచినీళ్ల వైకుంఠం, దొంతరబోయిన హరీష్, శివకృష్ణ, శేఖర్, గోలి లావణ్య, పుప్పాల వనిత, గడ్డం స్వరూప, పల్లెల రజిత తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌తో పాటు నేతలు

చిన్నకాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్
భూసేకరణపై గ్రామసభ



గ్రామసభలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నకాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించి భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రామసభ నిర్వహించారు. కెనాల్ నిర్మాణం కోసం గత నెల 21న ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలైంది. ఈనేపథ్యంలో శివారుల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక నోటిఫికేషన్‌లోని అంశాలను రైతులకు వివరించారు. బ్రాహ్మణపల్లి శివారులో వరితో పాటు వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి పంటలు పండే భూములున్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకుని కెనాల్ కేవలం వరి పొలాల వరకు మాత్రమే నిర్మించాలని రైతులు కోరారు. మెట్ట భూముల్లో కాల్వల నిర్మాణం చేపడితే తాము నష్టపోవాల్సి వస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం కాల్వ తమ గ్రామం చుట్టూ వస్తుందని, దీని వల్ల వర్షాకాలంలో వరదలు ఎక్కువైతే తాము ఎటు వెళ్లలేని పరిస్థితులు ఉంటాయని అధికారులకు వివరించారు. మెట్టభూముల్లో కాల్వ నిర్మాణం చేయొద్దని, గ్రామం చుట్టూ కాకుండా ఒకేవైపు కెనాల్ వచ్చేలా అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. ఈ మేరకు గ్రామస్థులు, రైతులు అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, సబ్‌కలెక్టర్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ షఫీ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గంగాధర్, ఏఈఈలు భరత్, ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికే గుర్తింపు

▸▸ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



హెచ్‌ఎం ఉమారాణి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కాటారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల అంకితభావంతో పనిచేసే వారికే విశేష గుర్తింపు లభిస్తుందని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కాటారం జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జన్నపురెడ్డి ఉమారాణి ఉద్యోగ విరమణ పొందగా అభినందన సభ మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఉమారాణి-జితేందర్‌రెడ్డి దంపతులను ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉమారాణి పీఆర్‌టీయూలో కమిట్‌మెంట్ కలిగిన కార్యకర్తగా పనిచేశారని కొనియాడారు. ఈ తరం ఉపాధ్యాయులకు విధుల్లో ఉమారాణి అంకితభావం, క్రమశిక్షణ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల పరిష్కారం, డీఏ బకాయిల విడుదల, హెల్త్ కార్డులను ప్రభుత్వం అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, మండల బాధ్యులు రవీందర్, తిరుపతి, సురేష్, ఉపాధ్యాయ సంఘాల నేతలు కరుణాకర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ..

- తగ్గిన కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు



మండలంలోని ఫత్తేపురంలో వరిపంటను కోస్తున్న యంత్రం

తొర్రూరురూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఆరంభంలో ఎంతో సుముఖంగా సాగు ప్రారంభించినా రబీ కాలం చివరి కోత దశలో కష్టాలు తప్పడం లేదని రైతులు, వ్యవసాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో సాగునీరు సమృద్ధిగా ఉండటంతో చెరువులు, బోర్లు, బావుల కింద సుమారు 18వేల ఎకరాల్లో సాగు చేసిన పంటలు కోతకు రావడంతో వరి కోతలు ప్రారంభించారు. 18వేల ఎకరాల్లో వరి సాగు చేయగా పొట్ట దశ, పాలుపోసే దశలో నీరు సరిపడా అందక రైతులు దిగుబడి తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మార్చి వరకు మంచు రావడంతో వరికి రోగాలు విస్తరించాయి. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలో వరి కోతలు, మిర్చి పంటలు ఏరివేత ఒకేసారి కావడంతో కూలీల కొరతతో కూలీల రేట్లు అధికంగా పెరిగాయి. మిర్చి ఏరబోతే రూ.250 నుంచి రూ.300 ఉండగా కూలీల కొరత ఏర్పడడంతో రైతులు వరికోత యంత్రాలను ఆశ్రయిస్తే ధరలు భారీగానే ఉంటున్నాయని వెల్లడిస్తున్నారు. వరికోత యంత్రం గంటకు రూ.2,200 అడుగుతున్నారు. ఎకరం వరి పొలం కోస్తే సుమారు రూ.3వేల వరకు ఖర్చు వస్తుంది. దీంతో ఎకరం పొలం సాగు చేసినప్పటి నుంచి కోత కోసే వరకు రూ.30వేల వరకు ఖర్చు వస్తుంది. ఈ దిగుబడి తగ్గడంతో రైతులకు ఏమి మిగలడం లేదని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని అమ్మాపురం, సోమారం, ఫత్తేపురం, పోలేపల్లి, వెల్లికట్టె తదితర గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి.

తగ్గిన కొనుగోలు కేంద్రాలు

రైతు కష్టపడి పండించిన పంటలను విక్రయించుకోవడానికి కోతలు ప్రారంభానికి ముందే గతంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొర్రూరులో 17, పెద్ద వంగరలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం కేవలం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 10 కేంద్రాలు, ఐకేపీసీ సెంటర్ నుంచి మడిపల్లి గ్రామంలో 1 కేంద్రం ఏర్పాటుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో విస్తారంగా కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు వరి ధాన్యం విక్రయించుకొని ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను కోల్పోతున్నారు. దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో రైతులకు దూరభారంతో, రూ.500 బోనస్ కోల్పోయి నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలి
కొత్తపల్లి రవి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహ కార్యదర్శి



ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కొనుగోలు కేంద్రాలు తగ్గించడం ద్వారా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

నిర్వహణ భారంతో తగ్గించాం..
వెలుగు మురళి, పీఏసీఎస్ సీఈవో, తొర్రూరు

రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా ధాన్యం కాంటాలు కావడం లేదు. కనీసం ప్రతీకేంద్రంలో రెండు లోడుల ధాన్యం కూడా రాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. దీంతో కొన్నిచోట్ల తగ్గించాం. అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తాం.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు

తాడ్వాయి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్న ఆర్‌ఎంపీపై ఔషధ నియంత్రణ అధికారి కేసు నమోదు చేసిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఔషధ నియంత్రణ అధికారి పావని దాడులు నిర్వహించి క్లినిక్‌లో లైసెన్సు లేకుండా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. 26 రకాల మందులు, తొమ్మిది రకాల ఫిజీషియన్ శాంపిల్స్ లభించాయని ఆమె తెలిపారు. వాటిని సీజ్ చేసి ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

26న మెగా జాబ్‌మేళా

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లిలో ఈనెల 26న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాబ్‌మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే 58వేల ఉద్యోగాలు భర్తీ చేయడమే కాకుండా రాజీవ్ యువ వికాసంతో 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుందని అన్నారు. అలాగే పదో తరగతి నుంచి బీటెక్, పీజీ, వరకు చదివిన వారికి అర్హతలనుబట్టి ఉద్యోగనియామకాలకు 700 కంపెనీలతో మాట్లాడి మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

చింతచెట్టు పైనుంచి పడి
గీతకార్మికుడి మృతి



వెంకన్న (ఫైల్)

కేసముద్రం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నెలో మంగళవారం ప్రమాదవశాత్తు చింతచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు బండారు వెంకన్న(56) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం... చింతచెట్టుపై భాగంలోంచి ప్రమాదవశాత్తు వెంకన్న జారి కిందపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మృతునికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి క్రయ విక్రయాలు చేస్తున్న యువకులను హనుమకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ, కోటగిరి రోహిత్‌లు సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్ర వాహనంపై ఒడిషాలో కల్మిల గ్రామానికి వెళ్లి నాగరాజు అనే వ్యక్తి వద్ద అరకిలో గంజాయి కొనుగోలు చేశారు. తమ దగ్గర ఉన్న గంజాయిని విక్రయించేందుకు ఇద్దరు నిందితుల్లో మణికంఠ అనే వ్యక్తి సోమవారం హనుమకొండకు రాగా, పోలీసులు పక్కా సమాచారంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తన దగ్గర గంజాయి కొనుగోలు చేసిన బాలుడితో పాటు మేకల అవినాశ్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓదెల అరుణ్‌లతో పాటు వ్యాపార భాగస్వామి రోహిత్ పేర్లు వెల్లడించగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనలో ఒడిషాకు చెందిన నాగరాజుతో పాటు మణికంఠ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వడ్డెపల్లికి చెందిన తాళ్లపల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



అఖిల (ఫైల్)

చిన్నగూడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలోని రామచంద్రుతండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... బాదవత్ అఖిల(25) ఇంట్లోని రేకుల పాకలో వంట చేస్తుండగా విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్ అయి రేకుల ద్వారా కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు రావుల రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కర్రెగుట్టలపైకి రాకండి

▸▸ కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం..

▸▸ తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు

▸▸ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల



ములుగు/వాజేడు/వెంకటాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా భావిస్తున్న కర్రెగుట్టలపైకి సాధారణ పౌరులెవరూ రావొద్దంటూ మావోయిస్టులు హెచ్చరించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసం గుట్టచుట్టూ బాంబులు అమర్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఓలేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుకుంటూ కర్రెగుట్టలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి విస్తరించి ఉన్నాయి. దట్టమైన అడవులు ఉన్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టు గెరిల్లా బేస్‌గా మార్చుకున్నారని, భద్రతా బలగాలు లక్ష్యంగా మందుపాతరలు అమర్చారని గతంలో పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. అటు భద్రాద్రి కొత్తగూడెం, ఇటు ములుగు జిల్లాను కలిపే ఈ గుట్టలు పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతి చర్యలతో నిత్యం అలజడిగా మారుతుంటాయి.

పోలీసుల మాటలు నమ్మొద్దు

ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరుతో చేస్తున్న దాడుల్లో అనేకమంది పార్టీ నాయకులు, పీఎల్‌జీఏ సభ్యులతో పాటు సాధారణ ప్రజలు బూటకపు అమరులు అవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. కగార్ దాడుల నుంచి రక్షణ పొందడానికి కర్రెగుట్టలపై బాంబులు అమర్చినట్లు తెలిపారు. బాంబులు అమర్చిన విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలిపినట్లు, అయినప్పటికీ కొద్ది మంది ఆదివాసీలు, ఆదివాసీయేతరులకు పోలీసులు మాయమాటలు చెప్పి నమ్మిస్తూ, డబ్బులు ఇస్తూ ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకొని షికారు పేరుతో కర్రెగుట్టలపైకి పంపిస్తున్నారని తెలిపారు. మావోయిస్టుల రక్షణ కోసం అమర్చిన బాంబుల బారిన పడి చనిపోతున్నారని, కొంత మంది గాయపడుతున్నారని అన్నారు. పోలీసుల మాటలు నమ్మి ఇన్‌ఫార్మర్‌లుగా మారొద్దని పేర్కొన్నారు.

చర్చనీయాంశంగా మావోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్‌లో నిర్బంధం ఎక్కువైన క్రమంలో తెలంగాణలోకి ప్రవేశించడానికి ఈ అడవే మావోయిస్టులకు దిక్సూచి. వారికి అడ్డుకట్ట వేసేందుకు నిఘా వేసిన పోలీసులు ప్రతిక్షణం అలర్ట్‌గా ఉంటున్నారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు వదలుతున్నారు. చాలామంది లొంగుబాటను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మావోయిస్టు లీడర్లు తెలంగాణ దండకారణ్యంలోకి వచ్చే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ చర్చనీయాంశంగా మారింది. గతనెల 23న వెంకటాపురం మండలం ఇప్పగూడానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి అనే వ్యక్తి ముత్యంధార జలపాతం సమీపంలో అడవిలోకి వెళ్లగా ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి మరణించగా, వెంకటాపురం మండలం అంకన్నగూడానికి చెందిన నవీన్, చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత తీవ్రంగా గాయపడ్డారు. అయితే.. ఈసంఘటనలను ఏనాడూ స్పందించని మావోయిస్టులు కర్రెగుట్టల చుట్టూ తాము మందుపాతరలు అమర్చామని తొలిసారి ప్రకటించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసమే బాంబులు పెట్టామని, ఈవిషయాన్ని పలు రూపాల్లో ప్రజలకు తెలియపర్చినట్లు లేఖలో పేర్కొన్నారు. పోలీసులు అమాయక గిరిజన, గిరిజనేతరులకు డబ్బు ఆశగా చూపించి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారని, అటవీ జంతువుల వేట పేరుతో అడవుల్లోకి పంపించి తమ కదలికలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈక్రమంలో తాము అమర్చిన బాంబులు పేలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. ప్రజలెవరూ పోలీసుల మాటలను నమ్మి మోసపోవద్దని, కర్రెగుట్టలపైకి రావొద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఏడాది పాలనలోనే తేలిపోయిందని మావోయిస్టు నేత శాంత ఆ లేఖలో ప్రస్తావించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని ప్రకటించి, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌పాలనలో ప్రజలఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, భూస్వాములు, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రజల ఆస్తులను బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు.

బాంబు డిస్పోజల్ బృందాలతో కర్రెగుట్టలపై తనిఖీలు

▸▸ ప్రజలను ఇన్‌ఫార్మర్లనడం సరికాదు ▸▸ ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు బాంబులు అమర్చిన కర్రెగుట్టల వద్ద భద్రతా చర్యలను పటిష్టం చేస్తున్నామని, బాంబు డిస్పోజల్ టీమ్‌లతో నిత్యం తనిఖీలు జరుపుతూ తొలగిస్తామని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఎవరికైనా బాంబుల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోందని, ఉనికిని కాపాడుకునేందు కోసం కర్రెగుట్టల వద్ద ప్రెషర్ బాంబులు అమర్చారని తెలిపారు. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారంగా బతుకుతున్నారని, ఈక్రమంలో బాంబులు పేలి ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. వారిని ఇన్‌ఫార్మర్లంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టుల చర్యలను పౌరహక్కుల సంఘాలు ఖండించాలని కోరారు.

రెండెకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధం

- సుమారు రూ.2 లక్షల మేర నష్టం
- మంటలు ఆర్పే క్రమంలో మహిళా రైతుకు గాయాలు



కొత్తగూడ మండలం పెగడపల్లిలో కాలిపోయిన మొక్కజొన్న పంట

కొత్తగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని పెగడపల్లిలో మంగళవారం జరిగింది. మంటలు ఆర్పే కమంలో మహిళా రైతుకు గాయాలు కాగా, కావాలనే పంటను కాల్చేశారని రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతు వివరాల ప్రకారం... పెగడపల్లి గ్రామానికి చెందిన బొల్లు రవి సుమారు 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంట చేతికి అందివచ్చిన క్రమంలో మొక్కజొన్నను కోసేందుకు రైతు సిద్ధం అవుతున్నాడు. మంగళవారం రవి చేనుకు సమీపంలో ఎవరో చెత్తను కాల్చివేస్తుండగా, మంటలు లేచి గాలికి వ్యాపించి మొక్క జొన్న పంటవైపు వ్యాపించింది. పంటకు అంటుకోగానే రైతు భార్య భర్తకు సమాచారం ఇచ్చింది. మంటలు ఆర్పే క్రమంలో మహిళ గాయపడింది. రవితో పాటు గ్రామస్థులు తరలి వచ్చి మంటలే ఆర్పివేసే ప్రయత్నం చేసేలోపు రెండు ఎకరాల్లో పంట దగ్ధమైంది. సుమారు రూ.2లక్షలు నష్టం వచ్చినట్టు బాధిత రైతు పేర్కొన్నారు. కాగా, కొందరు కావాలనే పంటకు నిప్పు పెట్టారని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు రవి పేర్కొన్నారు.

అమినాపురంలో ఎకరం మొక్కజొన్న దగ్ధం

కేసముద్రం: కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమినాపురంలో యారె రమేష్‌కు చెందిన ఎకరం మొక్కజొన్న చేను మంగళవారం దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపారు. పొరుగున ఉన్న రైతు సొప్ప కాల్చడంతో నిప్పు వ్యాప్తి చెంది తన చేనుకు నిప్పంటుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో రూ.50వేల విలువైన మొక్కజొన్న కంకులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

నష్టపోయిన రైతులకు
పరిహారం అందిస్తాం

▸▸ కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు అశోక్

గోవిందరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని, దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన ఆర్డీవో వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి మండలంలోని రంగాపూర్, గోవిందరావుపేట, రాఘవపట్నం, కోటగడ్డ, పస్రా గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలంగా కురిసిన వడగండ్ల వర్షం, సుడిగాలుల బీభత్సానికి ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయి నిలువనీడ లేకుండా అయిందని, మామిడితోటల్లో మామిడికాయలు రాలిపోయి రైతులు చాలా నష్టపోయారని అన్నారు. దెబ్బతిన్న పంటలకు, దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు పరిహారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. వడగండ్ల వర్షం, సుడిగాలి బీభత్సంతో సుమారు 170ఎకరాల్లో మామిడితోటలు, 6వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. అధికారులు మండలంలోని గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



ఎండలవేళ పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే

ఖానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్ల అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి, ఎండ వేడిమికి దాణ సరిగా తినక పోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుండి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరుచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.

మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభాదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి అందించాలి. మాగుడు గడ్డి ఉంటే సంవృద్ధిగా అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్ల తాగేలా చూడాలి.

టీకాలు తప్పనిసరి

ఎండాకాలంలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో పశువులు సులువుగా జబ్బుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా టీకాలను ఇప్పించాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల మందులను తాగించాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు..

నివారణోపాయాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. ముట్టెపై చెమట లేకపోవడం, కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. పశు వైద్యుడి సహాయంతో చికిత్స అందించాలి.

పశువులకు వెంటనే చికిత్స చేయించాలి

శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి, ఖానాపురం



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలుమార్లు నీటితో కడగాలి. చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలి. వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

కాళేశ్వరం.. మునులు, రుషుల తపోక్షేత్రం

- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ముక్తీశ్వరుడి సన్నిధి
- ఈ ఏడాది సరస్వతీ పుష్కరాల వైభవం

మహదేవపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారంగా.. బ్రహ్మ విద్యల తపోక్షేత్రంగా.. ఎందరో రుషులు, మునులు తపస్సులు చేసిన పుణ్యస్థలంగా.. ఎన్నో పాతకాలను పారదోలిన శైవ క్షేత్రంగా.. వేదకాలం నుంచి స్వచ్ఛ గోదావరి తరగలతో జన్మ తరింపజేసుకున్న పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది కాళేశ్వరం. బ్రాహ్మణ అగ్రహారాలుగా విశ్వ విఖ్యాతి గాంచిన మంత్రకూటం, చెన్నూరు, కాళేశ్వరం పుణ్యతీర్థ క్షేత్రాలు.. సంప్రదాయ షట్శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలను పఠించి భావితరాలకు అందజేసిన జాబాలి, అగస్త్యుడు, గౌతముడు నడయాడిన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితల మధ్యలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదికి ఈ ఏడాది పుష్కరాల వైభవం సంతరించుకుంది. వేదవ్యాస మహర్షి స్కంద పురాణంలో కాశీ ఖండంలో పేర్కొన్న సమాచారం కాళేశ్వర క్షేత్రం ప్రసిద్ధిగా నిలుస్తోంది. భారతదేశ యాత్ర ప్రారంభించిన అగస్త్య మహర్షి గోదావరి జన్మస్థానమైన నాసిక్ త్రయంబకం క్షేత్రంలో స్నానమాచరించి వ్యాస ప్రతిష్ఠ సరస్వతిని దర్శించి కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో స్నానమాచారించారు. తన యాత్రకు గుర్తుగా చెన్నూరులో అగస్త్యేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ చేయించారు. నేటికీ చెన్నూరు ఆలయంలో అగస్త్యేశ్వరుడి పురాతన ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. 400 ఏళ్లుగా అఖండ జ్యోతి దీపం వెలుగుతుండడం విశేషం. అలాంటి ఎంతో విశిష్టతలు కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని సరస్వతీ పుష్కరాల వేళ దర్శించుకుంటే ఎంతో మంచిదని పండితులు చెబుతున్నారు. వచ్చేనెలలో సరస్వతీ పుష్కరాల వేళ కాళేశ్వరం చరిత్ర గురించి ప్రత్యేక కథనం.

- సహజ కవి బమ్మెర పోతన తెలుగులో మహా భాగవతం రాయాలనే తపనతో ఏమి తోచని పరిస్థితిలో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం చేసి శ్రీకారం చుట్టినట్లు అభినవ పోతన వానమమలై వరదాచార్యులు రాసిన పోతన చరిత్రము తెలుపుతోంది. గౌతమ మహర్షి శిష్యులకు వేద పఠనం చేస్తున్న సమయంలో మంత్ర కూటం ప్రాంతంలో కరువు కాటకాలు వచ్చాయి. తపోబలంలో ఏ రోజుకారోజు పంట పండించి శిష్యులకందిస్తే అసూయపరులు కుట్రలతో మాయా ధేనువు సృష్టించిన వేళ దర్భ కర్రతో అదిలించగా గోవు మృతిచెంది గౌతమ మహర్షికి గోహత్యా పాతకం కలిగింది. నివారణ కోసం కాళేశ్వరంలో సరస్వతీ మాతను దర్శించి శివుడి కోసం తపస్సు చేసుకుని గోదావరితో కూడిన మహాసరస్వతిని దర్శించడంతో గోహత్యా దోషం నివృత్తి కలిగిందని, అందుకు సాక్ష్యమే మంత్రకూటంలో గౌతమేశ్వరాలయమని కాళేశ్వర ఖండంలోని కథనం చెబుతోంది.
- కాళేశ్వరం క్షేత్రంలో అష్టతీర్థాలు శివుని ఎనిమిది రకాల రూపాలకు సాక్ష్యాన్ని కథలున్నాయి. కొందరు దొంగలు ప్రతి రోజు కాళేశ్వరం ప్రాంతంలో దొంగతనాలు చేసి తెల్లవారుజామున పరుగెత్తి వెళ్లేవారు. రాజులు వేసిన శిక్షలు అనుభవించి బాధపడేవారు. జాబాలితో సహా పస్తర్షులు ఎదురుపడి పాప పరిహారం కోరారు. వారు గోదావరి నీరు చల్లగానే ప్రాణాలు కోల్పోయారు. రుషులకు బ్రహ్మత్యా పాతకం కలగ్గా నివారణకు కాళేశ్వరం చేరి సరస్వతి సంగమంలో స్నానం చేసి పునీతులయ్యారట. తర్వాత కొన్నాళ్లకు రుషులు కాశీకి వెళ్లగా నాటి దొంగలే మహారాజులుగా కనిపించి రుషులను గౌరవించి ఆదరించారు. కాశీలో విద్యాలయాల్లో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమం ప్రాచుర్యాన్ని ప్రచారం చేయించారు.



కాళేశ్వర ఆలయం

- త్రేతాయుగంలో శ్రీరాముడు పంచవటిలో సీతాపహరణం జరిగిన తర్వాత భరించరాని తాపంతో ప్రయాణిస్తూ కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానమాచరించి ముక్తీశ్వరుడిని పూజించారట. సుగ్రీవుని చొరవతో దేశంలోని రుషులందరిని పిలిపించి యజ్ఞయాగాలు చేయించనట్లు పురాణాలు చెబుతున్నాయి. కాళేశ్వరం నదీతీరంలో హనుమత్ తీర్థం, వీరాంజనేయస్వామి దేవాలయం, శ్రీ సీతారామ చంద్రమూర్తి ఆలయాలు అందుకు సాక్ష్యాలుగా ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు.
- ఇక శివతత్వాన్ని గ్రామీణులకు వివరించేందుకు పదకొండో శతాబ్దంలో నీలకంఠేశ్వరాధ్యుడు ఎంతో కృషి చేశాడు. నారదబ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానం రాసి.. గోదావరి పరివాహక ప్రాంతం మధ్వాచార్యుల తీరంలో సోన్‌సమీపంలో నిర్మల్‌కు చెందిన నిర్మల శంకరశాస్త్రీ నీలకంఠేశ్వర వ్యాఖ్యానానికి వివరణ, విశ్లేషణ రాశారు. ఆ గ్రంథంపై ప్రముఖ తత్వవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట ఉపోద్ఘాతం రాయడం విశేషం. కాళేశ్వరం, చంద్రువెల్లి ప్రాంతాల్లో వేద పాఠశాలలు నెలకొల్పి వీరభద్ర పండిత శివారాధ్యులు కాళేశ్వరం సరస్వతీ క్షేత్ర మహిమలు ఎల్లవేళలా ప్రాచుర్యం పొందేలా చేశారు. కాకతీయుల సామ్రాజ్యంలో విద్యారణ్యుల శిష్య పరమాణువు కాళేశ్వరం రాజయ్యారాధ్యులు కాళేశ్వర ఖండం గ్రంథం ముద్రణలో చొరవ చూపారు. కాకతీయులు కాళేశ్వరం త్రివేణి సంగమంలో రాజు శిరం బరువుకు సమానమైన ధనం తులా పురుషదానం చేసి తరించినట్లు గయా క్షేత్రంలో లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా సరస్వతీ అంతర్వాహినిగా ఉన్న గోదావరిలో సరస్వతీ పుష్కరాల సమయంలో స్నానం చేయడం ద్వారా పిల్లలకు విద్యా విజ్ఞానం పెరుగుతుందని, అది తమ అదృష్టమని భక్తులు భావిస్తారు.

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల

- అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే
- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి : కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లిదండ్రులు



విద్యార్థికి ఎంబీబీఎస్ పట్టా అందజేస్తున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాలలో 61వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. 2019 బ్యాచ్‌కు చెందిన 230మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పట్టాలు అందుకోగా.. వారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పులకించిపోయారు. ఆనందంతో వారిని ముద్దాడారు. తమ కలలు సాకారం చేశారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య వికాసానికి వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, యువ వైద్యులు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని పాటించాలని సూచించారు. వైద్యుడిని దేవునితో సమానంగా కొలిచే సమాజంలో ఉన్నామన్న విషయాన్ని మరువొద్దని, ప్రజల్లో ఉన్న ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువ వైద్యులు కృషి చేయాలని కోరారు. అంకితభావమున్న వైద్య లను సమాజం ఆదర్శవంతంగా చూస్తుందని అన్నారు. ఇదే కళాశా లలో పట్టాలు పొందిన అనేక మంది వైద్యులు విశిష్టమైన సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన కేఎంసీ నుంచి పట్టాలు పొందిన యువ వైద్య లు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాగే ఎంత ఎత్తు ఎదిగినా తాము చదువుకున్న కళాశాల, అధ్యా పకులు మరవకూడదని హిత వు పలికారు. ఈ కార్యక్ర మంలో కాళోజీ నారాయణ రావు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంధ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

న్యూరో సర్జన్ అవుతా..

పిన్నింటి భార్గవి



ఎంబీబీఎస్ పట్టా పొందటం ఆనందంగా ఉంది. న్యూరో సర్జన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మా అమ్మ పద్మశ్రీ, నాన్న వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి వారు అందించిన ప్రోత్సాహంతోనే నేను వైద్య విద్య వైపు వచ్చా. వైద్య విద్య పూర్తి చేసిన మా పెదనాన్న కొడుకు కూడా నాకు స్ఫూర్తి. భవిష్యత్‌లో ఆరోగ్య వికాసానికి సేవలందిస్తా.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

పచ్చదనానికి ప్రణాళిక సిద్ధం

- హరితహారానికి మొక్కలు సన్నద్ధం
- ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- మండలంలో 3.90 లక్షల మొక్కల లక్ష్యం

నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతరించిన అడవులకు ఊపిరి పోయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం తోడ్పడనుంది. త్వరలో నిర్వహించనున్న పదకొండో విడత హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా, వర్షాలు సమృద్ధిగా కురవడానికి, వాతావరణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా హరితహారం కోసం నెక్కొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 3.90లక్షల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధంచేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

6 నుంచి 8 వేల మొక్కల పెంపకం లక్ష్యం

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 6 నుంచి 8 వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం నర్సరీల్లో బెడ్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు నెలల కిందటే సరఫరా చేశారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలైన బొప్పాయి, జామ, నిమ్మ, సీతాఫలం, రామాఫలం, నారింజ, నేరేడుతో పాటు వృక్ష సంబంధిత మొక్కలైన గుల్‌మోహర్, వేప, కానుగ, టెంటోఫోరం, మునగ, టెకోమా పెంచుతున్నారు.



మొక్కల కలుపు తీస్తున్న కూలీలు



ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి మొక్కలు నాటుతున్న కూలీలు

పక్షుల నుంచి రక్షణకు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రతనుంచి తట్టుకోవడానికి రోజుకు కనీసం మూడుసార్లు నీరు అందిస్తున్నారు. అలాగే మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గ్రీన్ పట్టాను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎండ తీవ్రత నుంచి తట్టు కోవడంతోపాటు, పక్షుల నుంచి కూడా రక్షణ ఉంటుంది.

మల్టీలేయర్ పద్ధతిలో..

నర్సరీలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, దేవాలయాల అవరణలో, కాలువ, చెరువుల గట్లపై, రోడ్డు వెంట మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నర్సరీలో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతి వనాలకు సరఫరా చేస్తామన్నారు.

ఉపాధి పథకం ద్వారా..

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా కూలీలకు పనులు దొరుకుతున్నాయి. నర్సరీలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.250 వరకూ కూలి పొందుతున్నారు.

మూడు నెలల్లో మొక్కలు సిద్ధం

వి.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, నెక్కొండ



గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 3.90లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణ విషయంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ

యాదగిరి, గుండ్రపల్లి నర్సరీ వాచర్



వర్షాకాలం ఆరంభంలో మండలంలోని గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నాం. ప్రతీ మొక్క ఎదిగేందుకు కవర్లలో మొక్కతో పాటు పెరుగుతున్న కలుపు తీస్తున్నాము. ప్రతీ ఇంటికి పండ్లు, పూల మొక్కలు ఆరు చొప్పున పంపిణీ చేస్తాం. మొక్కలు ఎండకు ఎండకుండా నిత్యం నీరు పడుతున్నాం.

ఆ ఉపాధ్యాయుడు.. ఆదర్శప్రాయుడు

- వృత్తిపై అంకితభావం.. సేవే ఆయన మార్గం
- తొమ్మిది 'ఉత్తమ' అవార్డులు అందుకున్న శ్రీనివాస్

పర్వతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉపాధ్యాయుడిగా వృత్తిలోనే కాదు సమాజ సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పడమే కాదు వారి తల్లిదండ్రులతో మమేకమై ఆ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేశారు. అంతే కాదు పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం, సామాజిక సేవాభావం కలిగిన ఆయన తొమ్మిది సార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొన్నారు. ఆయనే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన మడత కొంరయ్య, మడత ఎల్లమ్మ దంపతుల కుమారుడు మడత శ్రీనివాస్. పేదకుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ పాఠశాల స్థాయి విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. బీకాం సీకేఎం కళాశాలలో 1983-86వరకు పూర్తి చేసి అనంతరం కాకతీయ యూనివర్సిటీలో 1986-88లో ఎంకాం పూర్తిచేసి 1988-89లో వరంగల్‌లోని బీఈడీ కళాశాలలో చదివారు. 1989లో డీఎస్సీకి ఎంపికై డిసెంబరు 1990లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్‌లో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ 1992 వరకు పనిచేసి అనంతరం అదే ఏడాది ఆగస్టులో పెద్దకొర్పోల్ జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడ 2002 వరకు పనిచేసి అనంతరం 2006లో ఎంపీపీఎస్‌లో హెచ్ఎంగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరంలో డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకెసి జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయి.. 2009 జూలై వరకు పనిచేసి పర్వతగిరి మండలంలోని ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ 2018వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటునందించారు. జూలై 2018లో అదే మండలంలోని బూర్గుమల్ల ఎంపీయూపీఎస్‌కు బదిలీ అయి హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా 15 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, 20 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో పనిచేసి తనదైన ముద్రను వేసుకున్న ఆయన ఈ నెలాఖరులో పదవీవిరమణ పొందబోతున్నారు.

వృత్తిలోనే కాదు.. సేవల్లోనూ అంకితభావం..

ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి అవగాహన కల్పించి మరీ పాఠశాలలను కాపాడడంలో శ్రీనివాస్ కీలక భూమిక పోషించారు. ప్రధానంగా బస్సు మార్గంలేని తండాలలో కొంత వరకు సొంత ఖర్చులు వెచ్చించి ప్రైవేటు వాహనాల ద్వారా పిల్లలను స్కూల్‌కు రప్పించారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఏ రోజు కూడా గైర్హాజరైన దాఖలాలులేవని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అత్యవసరమైతే చట్టపరమైన సెలవుతీసుకుంటారు. అంతేకాదు.. ఏదైనా రోజు ఒక్క నిమిషం ఆలస్యమైనా.. సగం పూట సెలవు పెట్టి మరీపాఠాలు బోధించి వెళ్తారట. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అతను అందించే ఆర్థిక సహకారాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం అందరినీ ఆకట్టుకుంటుంది. ఒక్కో సందర్భంలో పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత డబ్బును ఖర్చుచేయడమే కాకుండా గ్రామస్థులు, నాయకులతో మాట్లాడి నిధులు సేకరించారు. ఇక పర్యావరణ హితం కోసం కృషి చేయడంతో పాటు.. తోటి ఉపాధ్యాయులను కూడా ఆ దిశగా నడిపిస్తున్నారు. తాను పనిచేసిన పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

అందుకున్న అవార్డులు..

మడత శ్రీనివాస్ అందించిన సేవలకు గాను విద్యాశాఖ గుర్తించి అనేక అవార్డులు అందించింది. ఇందులో ప్రధానంగా 2001 సంవత్సరంలో నర్సంపేట డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడును అవార్డును ప్రతిభా సేవా సంస్థ ఆధ్వర్యంలో అందుకున్నారు. 2011 సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ అవార్డు అందజేశారు. 2012లో పర్వతగిరి మండలంలో బెస్ట్ హెచ్ఎంగా మారీ స్వచ్ఛంద సంస్థ అవార్డు ప్రదానం చేసింది. అలాగే 2019 సెప్టెంబరులో మరోసారి జిల్లా స్థాయి అవార్డు అందుకున్న శ్రీనివాస్ 2022లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఎంఈవో నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2023 సెప్టెంబరులో కలెక్టర్ నుంచి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



శ్రీనివాస్ (ఫైల్)



2023లో కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)



ప్రస్తుతం శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తున్న బూర్గుమల్ల పాఠశాల

అన్నదాతలకు అపార నష్టం


రేగొండలో నేలవాలిన మొక్కజొన్న పంట

మంగపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈదురుగాలులతో వడగళ్ల వాన కురిసింది. దీంతో వరి, మిర్చి మొక్కజొన్న పంటలు, మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. మల్లూరు, మల్లూరుమొట్లగూడెం, నర్సింహసాగర్, గాంధీనగర్, నరేంద్రావుపేట గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 12 వందల ఎకరాల వరి పంట దెబ్బతింది. వరి గింజలు నేలమట్టమయ్యాయి. మామిడి కాయలు రాలిపోయాయి. నష్టపోయిన పంటను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. అలాగే నర్సింహసాగర్‌లో వడగాళ్ల వానతో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ దివార, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ పరిశీలించారు. రైతులను పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): సోమవారం సాయంత్రం ఈదురు గాలులతోపాటు కురిసిన అకాల వర్షంతో అరటిరైతులకు అపార నష్టం వాటిల్లింది. పంట చేతికొచ్చే సమయానికి పెనుగాలులతో మండల కేంద్రానికి చెందిన పిట్టల సురేష్, పిట్టల నారాయణకు చెందిన పాలంపేట రోడ్డులో కొగ్గానికుంట పక్కన మూడెకరాల్లో అరటితోట ధ్వంసమైంది. ఈదురుగాలులు, వడగండ్ల వానతో వందలాది ఎకరాల్లో అరటి, మామిడి, నిమ్మ, కూరగాయల పంటలు నేలపాలు అయ్యాయి.

• రేగొండ (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడగా, మరికొన్ని చోట్ల మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. రేగొండ శివారులోని ఎడ్ల మల్లారెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట నేలపాలైంది.

• కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తపల్లిలో ఈదురుగాలులతో ఓ ఇంటి రేకులు కూలిపోగా పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన పోలాటి సరోజన అనే వృద్ధురాలు ఎస్ఎం కొత్తపల్లి గ్రామంలో కూలీనాలి పని చేసుకుంటూ ఒంటరిగా జీవనాన్ని సాగిస్తోంది. ఈ క్రమంలో రాత్రి వీచిన గాలివానంతో ఆమె నివాసం ఉంటున్న ఇంటి రేకులు కుప్పకూలాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న సదరు వృద్ధురాలు సరోజన ఓ మూలకు వెళ్లి తలదాచుకోంది.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి గంటపాటు ఈదురు గాలులు వీయడంతో అరటిపంట, బొప్పాయి, మామిడి, వరి పంటలు నేలకూలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతులు గంపల మధుకర్, రమేష్, ఆకుల సతీష్, క్యాతం రమేష్, భద్రయ్య, సూర సుదాకర్‌కు చెందిన అరటి, బొప్పాయి పంటలు చేతికందిన సమయంలో అకాల గాలులతో నేలపాలయ్యాయి. సుమారు 30 ఎకరాల్లో అరటి, 10 ఎకరాల్లో బొప్పాయి. 10 ఎకరాల్లో మామిడి, వంద ఎకరాల్లో వరిపంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న అరటి, బొప్పాయి పంటలను బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ పరిశీలించారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

• ఏటూరునాగారం, (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులులు, అకాల వర్షంతో ఏటూరునాగారం, రొయ్యూరు, అల్లావారిఘణపురం, శంకరాజుపల్లి, వీరపూర్, బాణాజీబంధం, భూటారం, చల్పాక, రామన్నగూడెం, రాంనగర్ తదితర గ్రామాల్లో మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మండల పార్టీ నాయకులతో కలిసి పంటలను సందర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో ములుగు అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు పర్యాటించారు. అల్లావారిఘణపురం, రొయ్యురు, ముల్లెకట్ట తదితర గ్రామాల్లోని దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. మండలంలో పూర్తిగా 100శాతం వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఆయన తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నష్టపోయిన రైతులకు తగినపరిహారం అందేలా కృషి చేస్తామన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్, మేడారం, నార్లాపూర్, బాయ్యక్కపేట, ఊరట్టంకాలనీలో సోమవారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, వానకు పలు పంటలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల ఇళ్లు ధ్వంసమయ్యాయి. జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజ్, ఎండీడీవో సుమనవాణి, తహసీల్దార్ సురేష్‌బాబు కాంగ్రెస్ నాయకులతో కలిసి పంటలను పరిశీలించారు. రైతులతోపాటు కూలిన ఇళ్ల బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా పైకప్పు కూలిపోయిన ఇండ్లను సర్వే చేశారు. దెబ్బతిన్న పంటలను, ధ్వంసమైన ఇళ్లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తదితరులు పరిశీలించారు.


మంగపేట మండలంనర్సింహసాగర్‌లో వరిపంట పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులు, దెబ్బతిన్న ఇళ్ల బాధిత కుటుంబాలను ఆదుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నాయకులు మండలంలోని పస్రా, కోటగడ్డ, తదితర గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలు, ఇళ్లను పరిశీలించారు. కోటగడ్డ గ్రామంలో పైకప్పు రేకులు లేచిపోయిన బాధిత కుటుంబాలకు బియ్యం, ఇతర వస్తువులు అందజేశారు. అనంతరం స్వరూప, బలరాం మాట్లాడుతూ వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులు, దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు పరిహారం అందించాలని, అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. పూర్తిగా దెబ్బతిన్న వరిపంటకు ఎకరాకు రూ.50వేలు, దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్, ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్త సుధాకర్‌రెడ్డి, నాయకులు మెరుగు సత్యనారాయణ, అంతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రమాదేవి, తదితరులు పాల్గొన్నార

జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ మండల ఇన్‌చార్జిల నియామకం

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ములుగు నియోజకవర్గ మండల ఇన్‌చార్జిలను మంగళవారం నియమించినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తెలిపారు. ములుగు మండలానికి వంగ రవి, బొక్క సత్తిరెడ్డి, చింతనిప్పుల భిక్షపతి, వెంకటాపూర్‌కు బానోత్ రవిచందర్, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, గోవిందరావుపేటకు రేగ కల్యాణి, తాడ్వాయికి గుమ్మడి సోమయ్య, మల్లంపల్లికి గొల్లపల్లి రాజేందర్, ఏటూరునాగారానికి పూజారి సురేంద్రబాబు, కన్నాయిగూడానికి గుండ్ల దేవేందర్, మంగపేటకు ఇర్సవడ్ల వెంకన్న, కొత్తగూడకు బానోతు రూప్‌సింగ్, గంగారంకు సుంకరబోయిన మొగిలి, వెంకటాపురంకు శ్రీరాముల రమేష్‌బాబు, వాజేడు మండలానికి విక్రాంత్‌లను నియమించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని ఆయన సూచించారు.

గొత్తికోయగూడాన్ని సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

వెంకటాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఊట్లతోగు గొత్తికోయగూడాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సునీత మంగళవారం సిబ్బందితో కలిసి సందర్శించారు. సుమారు పది కిలోమీటర్ల దూరంలో అడవిలో ఉన్న గొత్తికోయగూడానికి ఆమె ఎడ్లబండిపై వెళ్లారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. గొత్తికోయగూడాల్లో తాగునీటి సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గొత్తికోయగూడాలను సందర్శిస్తున్నట్టు తెలిపారు. గూడెంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పేడువీరాపురం, వెంకటాపురం, బర్లగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి ఏగ్రేడ్ రకానికి రూ.2320, కామన్‌గ్రేడ్ రకానికి 2300ల మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ, ఏఈవో శ్యామ్, సిబ్బంది పూర్ణ, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వాజేడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో వాజేడు, పేరూరు, ప్రగళ్లపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య, వైస్ చైర్మన్ వత్సవాయి జగన్నాథరాజు, నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. దళారులకు అమ్మి మోసపోద్దన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో సోమ సత్యనారాయణ, ఏఈవో జాఫర్, సంఘ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేషనల్ పేయింటింగ్ పోటీల్లో జాకారం గురుకులం విద్యార్థుల ప్రతిభ



ప్రతిభను కనబర్చిన విద్యార్థులతో ఎంపీడీవో, ఉపాధ్యాయులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన డ్రీమ్ చిల్డ్రన్ నేషనల్ పేయింటింగ్ పోటీల్లో ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు గోల్డ్‌మెడల్, ఇద్దరు విద్యార్థులు సిల్వర్ మెడళ్లు సాధించారని ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : వెంకటరెడ్డి

గోవిందరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఎం, తెలంగాణ రైతుసంఘం నాయకులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు, ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ వడగండ్ల వానతో వందలాది ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నదని, దీంతో రైతుల పరిస్థితి కోలుకోలేని విధంగా తయారైందని అన్నారు. అంతేకాకుండా పెద్దఎత్తున వచ్చిన ఈదురుగాలులతో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయని, మామిడితోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. దెబ్బతిన్న వరిపంట ఎకరాకు రూ.50వేలు, మామిడితోటకు రూ.50వేల చొప్పున పరిహారం అందించాలని, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ, హార్టికల్చర్, రెవెన్యూశాఖల అధికారులు దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం నాయకులు తీగల ఆదిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, గుండు రామస్వామి, రైతులు మట్ట వెంకటపాపిరెడ్డి, బాధావత్ బాలు, శివనాయక్, శివరామకృష్ణ, ఈశ్వర్‌రావు, తుమ్మల సుధాకర్‌రెడ్డి, బైరి కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోనంపేట సమీపంలో పులి మాదిరి పాదముద్రలు

మహాముత్తారం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోనంపేట గ్రామ సమీ పంలోని వాగు వద్ద మంగళవారం ఉదయం గ్రామస్థులు పులి మాదిరి పాద ము ద్రలను గుర్తించారు. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు అక్కడికి చేరు కొని పరిశీలించారు. అయితే.. అవి హైనా పాదముద్రలు అయ్యుంటాయని అంటు న్నారు. పులి పాదముద్రల్లా లేవని తెలిపారు. కొద్ది నెలలుగా కాటారం, పెదపల్లి, దూదెకులపల్లి, రాంపూర్ అడవుల్లో పులి సంచరించిన విషయం విదితమే. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు భయంతో వణికి పోతున్నారు. పులి సంచరిం చినట్టు ఫారెస్టు అధికారులు గతంలో ధ్రువీకరించిన నేపథ్యంలో ఆందోళన చెందు తున్నారు. కోనంపేట వచ్చింది పులే అని గ్రామస్థులు నమ్ముతున్నారు. ఈ విష యంలో ఆంజనగర్ రేంజర్ ఉషాను వివరణ కోరగా తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించారని, ఆ పాదముద్రలు పులివి కావని, హైనా లాంటి జంతువువి అయ్యుంటాయని తెలిపారు.

'యువ వికాసం' సద్వినియోగం చేసుకోండి

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల నిరుద్యో గులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి ప్రింట్ ఫారంతోపాటు సంబంధిత జిరాక్స్ పత్రాలు, కలర్ ఫొటోతో ఈనెల 14లోగా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ పక్వాడా'

కాటారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడిపిలవంచ, కాటారం, ప్రతాపగిరి, కొత్తపల్లి, నస్తూరుపల్లి, మేడిపల్లి, బయ్యారం, చిద్నెపల్లి, గుమ్మాళ్లపల్లి, ఇబ్రహీంపల్లి జీపీల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పోషన్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పక్షోత్సవాల తొలి రోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలిం తలకు మొదటి వెయ్యి రోజులపై అవగాహన చేశారు. పెరటి తోటల పెంపకం, పౌష్టికాహార ఆవశ్యకతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, అమ్మక్క, అన సూయ, అమృతరాణి, విమల, ప్రేమలత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సీఎంవోను కలిసిన ఏఐటీయూసీ నేతలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్ర జ్యోతి): కొతగూడెం సింగరేణి మె యిన్ హాస్పిటల్‌లో సీఎంవోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిరణ్‌రాజ్‌ను ఏఐటీయూసీ నాయ కులు మంగళవారం మర్యా ద పూర్వకంగా కలిశారు. ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కె.బాజీ సైదా, భూపాలపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రాంచందర్ కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలం దించాలని, ఖాళీగా ఉన్న ఆస్పత్రుల్లో వైద్యుల నియామకాలు చేపట్టాలని కోరారు.

ఘనంగా పూర్ణాహుతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదపండితులు యల్లాప్రగడ మణికంఠశర్మ, ప్రధాన అర్చకుడు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో పంచ బ్రహ్మోత్సవాల పూజలు జరిపించారు. అంతేకాకుండా నాకబలి కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను అలంకరించి 12 రకాల పూలతో పుష్పార్చనలు చేశారు. 12 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఆలయ చుట్టూ 12 రకాల వాయిద్యాలో వాయిస్తూ ప్రదక్షిణలు చేయించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే సత్యనారాయణరావు


రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని ముచినిపర్తి గ్రామంలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఆయన పాల్గొన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని కించపరిచేలా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు.

సీత్లా భవాని వేడుకల్లో..

మండలంలోని అందుకుతండలో లంబాడా, గిరిజనులు ఆరాధ్య దైవం సీత్లా భవాని వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణ రావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆయన సీత్లా భవాని ఆశిస్సులతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, నందునాయక్, సీతారామ్‌నాయక్, సమ్మయ్య, రాజునాయక్, కళ్యాణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి చికిత్స శిబిరం

కాటారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 26వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీపాద మెమోరియల్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల కంటి చికిత్స శిబిరం మంగళవారం ముగిసింది. రెండోరోజు శిబిరాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాతృమూర్తి జయశ్రీ సందర్శించారు. స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిబిరంలో 2041 మందికి ఓపీ పరీ క్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో రికార్డ్‌స్థాయిలో 953 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. 556 మం దికి కంటి అద్దాలు అవసరం కాగా ఈనెల 13న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఉచితంగా అందిస్తారన్నారు. కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమైన వారిని విడతవారీగా తీసుకెళ్లి కంటి శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ మండల అధ్యక్షుడు మహేష్, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, మాజీ ఎంపీపీ సమ్మయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మహేం దర్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం కొనుగోలు చేయాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యాసంగి ధాన్యం కొనుగోలును పకడ్బందీగా చేపట్టాలని అధికారలను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, పౌరసరఫరాలు, సహకార, వ్యవసాయ, డీఆర్డీఏ, తూనికలు కొలతలు, కార్మిక శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. పలు అంశాలను సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించాలన్నారు. గ్రేడ్- ఏ రకానికి రూ.2,320, గ్రేడ్-బీ రకానికి రూ.2,300 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. 50 శాతం కొనుగోలు కేంద్రాలు మహిళా సమాఖ్యలకు కేటాయించాలన్నారు. ఎంపిక చేసిన గ్రామ సమాఖ్యలకు కొనుగోలుపై అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్స్, తూకపు యంత్రాలు, టార్పాలీన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశించారు. సన్న రకం, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలన్నారు. సన్నరకం ధాన్యానికి బోనస్ ఉంటుందని తెలిపారు. ఏఈవో లతో టోకెన్లు తీసుకుని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసు కోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజ యలక్ష్మి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రాములు, డీఆర్డీవో నరేష్, డీఏవో వీరునాయక్, జిల్లా సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ ఏడీ కనక శేఖర్, తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీలత, సహాయ కార్మిక శాఖ అధికారి వినోద పాల్గొన్నారు.

విరిగిపడ్డ చెట్టును ఢీకొన్న బైక్

యువకుడికి తీవ్రగాయాలు

కాటారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం-ప్రతాపగిరి రహదారిపై చింతల చెరువు సమీపంలో మంగళవారం రాత్రి గాలిదుమారంతో విరిగిపడ్డ చెట్టును బైక్ ఢీకొని చిద్నెపల్లికి చెందిన మంథెన పూర్ణచందర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పూర్ణచందర్ చిద్నెపల్లి నుంచి స్నేహితుడు శేఖర్‌ను బైక్‌పై ఎక్కించుకుని మండల కేంద్రం వస్తుండగా గాలిదుమారంతో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టును ఢీకొని ఎగిరిపడ్డారు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.


గాయపడిన పూర్ణచందర్

సర్వర్ ఉద్యమస్ఫూర్తిని కొనసాగిద్దాం

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల అభ్యున్నతి కోసం పోరాడిన కమ్యూనిస్టు నేత సర్వర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎంసీపీ (యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య అన్నారు. ఎమ్మీ.సర్వర్ వర్ధంతి సభ మంగళ వారం మల్లంపల్లి మండలం రామచంద్రాపురంలో జరగగా ఆయన స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. సర్వర్ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో చెలరేగిన మంటలు

మల్హర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల సబ్ స్టేషన్‌లో మంగళవారం ఉదయం కోతి 11 కేవీ వైర్లపై దూకడంతో పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో కెపాసిటర్ బ్యాక్ ఫెయిలైనట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. దీంతో అరగంట పాటు కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కోతుల వల్ల నిత్యం గ్రామాల్లో ఏదో ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : నాగజ్యోతి

గోవిందరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వర్షంతో నష్టపోయిన మండలంలోని రైతులు, దెబ్బతిన్న ఇళ్ల బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీమాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె మండలంలోని కోటగడ్డ గ్రామంలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలు, ఇళ్లను పరిశీ లించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50వేలు, దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. గాలివాన బీభత్సంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మిర్చి రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహా నాయక్, నాయకులు పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, నాం పూర్ణచందర్, మల్లేష్, ఐలయ్య, గడ్డం తిరుపతమ్మ, పాల్వాయి మల్లమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగజ్యోతి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా : శ్రీపాల్‌రెడ్డి

మల్హర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను వంద శాతం పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రారం ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌బాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.